# మైనర్ల సోషల్ మీడియా వాడకం

సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా వాదనలు వినిపిస్తూ, అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.


www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శుక్రవారం,సెప్టెంబర్11,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:194 | పేజీలు: 8 | వెల: రూ.5/-


## ప్రతిపక్ష కుట్రలను బలంగా

# తిప్పికొట్టాలి..

- జాతీయ జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి
- 22 ఏపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం
- భూముల చిట్టా బయటపడుతుందనే హరీశ్‌లో ఆందోళన

## వెయ్యి రోజుల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 10

బీఆర్ఎస్‌కు అధికారంపోయినా అహంకారం వీడటం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి( ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ) సజావుగా జరగకుండా ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కుట్రలు చేశారని సీఎం మండిపడ్డారు. పోలీసు అధికారుల(ను, ప్రజాప్రతినిధులను దూషించి మూడురోజులు సభ జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించడం, స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించడం హేయమన్నారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేసిన ప్రజా ప్రతినిధులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు. భవిష్యత్‌లోనూ ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌ల్లో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ( (సీఎల్పీ) సమావేశం జరిగింది. ఈ భేటీకి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఇందులో అసెంబ్లీలో అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యేలు కొమ్మిడి నరసింహారెడ్డి, వంగా సుబ్బారావు, జీ సిద్దయ్య మృతిపై సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రతిపక్షం తీరు, అసెంబ్లీలో జరిగిన పరిణామాలు, భవిష్యత్ వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. స్పీకర్‌ను దూషించినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధిచేసి అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టడం జరిగిందని స్పష్టంచేశారు.

# ఈగోలు వీడి ప్రజాసేవ చేద్దాం

- స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం: కలెక్టర్లతో సీఎం చంద్రబాబు
- ఈగోలు లేకుండా ప్రజా సేవకులుగా నిలుద్దామంటూ చంద్రబాబు పిలుపు

### రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు పయనిద్దాం.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మిద్దామన్న సీఎం

- 'సీఈఓ సీఎం' కన్నా 'వాటర్ మ్యాన్' అన్నప్పుడే ఎక్కువ సంతోషం కలిగిందని వెల్లడి
- 2027 మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ 'జే' బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన



అమరావతి,సెప్టెంబర్10,

"అందరం ఈగోలు పక్కనపెట్టి ప్రజల కోసం పనిచేద్దాం, నిజమైన ప్రజా సేవకులుగా నిలుద్దాం. రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు పయనిద్దాం. వన్ స్టేట్, వన్ మిషన్, వన్ ఎయిమ్.. అదే స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సును ప్రారంభించిన ఆయన, తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ లక్ష్యాలను వివరిస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. నాయకత్వ లక్షణాలు, సుపరిపాలన, అభివృద్ధి మంత్రాలను అధికారులకు వివరించారు.

### రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టాం

రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా గత 27 నెలల్లో ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడినపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ కాలంలో రూ. 1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ. 1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని వివరించారు. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్‌కు కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వంటి కార్యక్రమాలతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేశామన్నారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్రం 13.44 శాతం వృద్ధి రేటు సాధించిందని, దీన్ని 15 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని, ప్రతి నెలా ఆర్థిక నివేదిక విడుదల చేస్తూ లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నామని తెలిపారు.

## మండలిలో రసాభాస..

# బీఆర్ఎస్ వాకౌట్

- చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు
- 22ఏ భూములపై చర్చకు అనుమతించపోవడంతో వాకౌట్ చేసిన సభ్యులు
- మార్షల్స్ వ్యవహరించిన తీరుపై మధుసూదనాచారి మండిపాటు



హైదరాబాద్,సెప్టెంబర్10,

తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు.

## ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం

- సచివాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి
- సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు




హైదరాబాద్,సెప్టెంబర్10

తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.

## దివ్యాంగుల పింఛన్లపై సీతక్క కీలక ప్రకటన

- దివ్యాంగుల పింఛన్లకు సెప్టెంబర్ 15 చివరి తేదీ
- రాష్ట్రంలో 4,66,351 మంది దివ్యాంగులకు పింఛన్లు ఇస్తున్నామన్న మంత్రి సీతక్క



హైదరాబాద్,సెప్టెంబర్10,

తెలంగాణలో అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీ అని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4,66,351 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారని చెప్పారు. ఇప్పటివరకు దివ్యాంగుల పింఛన్ల కోసం 1,23,199 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హత ఉన్నవారికి పింఛన్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. థలసేమియా బాధితులకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు.

## తెలంగాణలో కరెంట్ వాడకం

# ఆల్-టైమ్ రికార్డ్

- తెలంగాణలో 19,543 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతేడాదితో పోలిస్తే 23 శాతం పెరిగిన కరెంట్ వాడకం
- అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం పెరగడమే కారణం



హైదరాబాద్,సెప్టెంబర్10

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం సరికొత్త రికార్డు సృష్టించింది. బుధవారం ఉదయం 10:41 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను విజయవంతంగా సరఫరా చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి 27న నమోదైన 19,506 మెగావాట్ల రికార్డును కేవలం ఆరు నెలల వ్యవధిలోనే అధిగమించడం గమనార్హం. గతేడాది ఇదే రోజు (2025 సెప్టెంబర్ 9) రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15,906 మెగావాట్లుగా నమోదైంది. దానితో పోలిస్తే, కేవలం ఏడాది వ్యవధిలోనే డిమాండ్ 23 శాతం పెరిగింది.

రాష్ట్రంలో వ్యవసాయ, గృహ, వాణి జ్య, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వాడకం గణనీయంగా పెరగడమే ఈ రికార్డు స్థాయి డిమాండ్‌కు ప్రధాన కారణమని అధికారులు విశ్లే షిస్తున్నారు.

## తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

- తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు
- ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి
- ఏ సమస్యపైన ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు




హైదరాబాద్,సెప్టెంబర్10

కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గురించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు.

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి
- అన్ని చెరువులు, జలాశయాల్లో నిమజ్జనాలు యథావిధిగా సాగుతాయని స్పష్టీకరణ




హైదరాబాద్,సెప్టెంబర్10,

హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

## తిరుమల భక్తులకు టీటీడీ భరోసా

- తిరుమల శ్రీవారి భక్తుల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచిన టీటీడీ
- దేశంలోనే తొలిసారిగా సహజ మరణానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం



తిరుమల,సెప్టెంబర్10,

శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అదేవిధంగా, కొండపై సహజంగా మరణించే భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది.

# ప్రతిపక్ష కుట్రలను బలంగా తిప్పికొట్టాలి..

మొదటి పేజీ తరువాయి

సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, హాజరుశాతం తగ్గకుండా చూసుకోవాలని రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించలేరని హెచ్చరించారు. అందరికీ వెసులుబాటుగా ఉండాలనే అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలిని నిర్వహిస్తున్నామని, అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్నామని సీఎం గుర్తుచేశా రు.సభ్యులు సభలో తమ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించాలని, అసెంబ్లీ జరిగినన్ని రోజులు సంపూ ర్ణ హాజరు ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయ కులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పో లీస్ సిబ్బందిపై దాడి ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసుల్లో రేవంత్ రెడ్డి కనిపించినట్లున్నారని, అంత ఆక్రోశంతో అధికా రులపై దాడులు చేశారని ఎద్దేవా చేశారు.

**ఓటర్ల జాబితాపై అప్రమత్తత..**

దేశానికి మనం చేసిన కులగణన రోల్ మోడల్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత అని సీఎం అన్నారు. తెలంగాణ నమూనాను జాతీయ స్థాయిలో అమలుచేయాలని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాల ని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రాంతీయ వార్తలుదేశంలో వయోజనుల జనాభా 103 కోట్లు గా తేలితే, ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లు గా చూపుతున్నారని, దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని, ఎస్ఐఆర్ అంశాన్ని సీరియస్‌గా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సభ్యుల ప్రతి ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని, వ్యక్తిగత పనితీరు గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని గుర్తుచేశారు. వెయ్యి రోజుల పాలనకు సహకరించిన అం దరికీ ధన్యవాదాలు తెలిపారు.

**మనది ఒకే మాట, ఒకే బాటగా..**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కలిసి పనిచేస్తే కుట్రలను ఎలా ఛేదించగలమో చేసి చూపించామని, బీఆర్ఎస్ నాయకుల తీరు, వారి భాష, శుద్ధీక రణపై సభ్యులందరం గట్టిగా ఎత్తిచూపి కట్టడి చేయగలిగామని అన్నారు. మనమం తా ఒకటే మాట.. ఒకటే బాటగా ఇదే పోరా ట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, మనం చేసుకోవాల్సిన ప్రచారం చేసుకోక పోవడం వల్లే ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్టవుతోందని, సరైన విధంగా ప్రచారం చేసుకుంటే ఆ ప్రవాహంలో ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయని భట్టి తెలిపారు. సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రజలకు తెలియజేయాలని, దేశంలో ఎక్కడా లేనివిధంగా 27 లక్షల మంది విద్యార్థులకు హైజెనిక్ బ్రేక్ ఫాస్ట్ అం దిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నా మన్నారు. చిన్న పొరపాటు లేకుండా కులసర్వే నిర్వహించి అసెంబ్లీలో ఆమోదించుకుని కేంద్రానికి పంపామన్నారు. ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమాను అమలు చేయబోతున్నామని, ఉద్యోగులకు కోటి రూపాయల బీమా అందిస్తున్నామని, మనం చేసిన పను లే మనల్ని గెలిపిస్తాయని భట్టి ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం చేసిన పనులపై ప్రతీ గ్రామంలో ఇంటింటికీ ప్రచారం జరగాలి. మన సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు చాలా సంతృప్తిగా ఉన్నారు. ప్రచార కార్యక్రమాన్ని పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని భట్టి సూచించారు.

**సర్‌పై అప్రమత్తంగా ఉండాలి..**

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో 'సర్' ప్రక్రియ దుర్మార్గంగా జరుగుతుందన్నారు. సర్‌పైన సీఎం రివ్యూ చేశారని తెలిపారు. పెద్దసంఖ్యలో ఓట్లను తొలగిస్తున్నారని ఆయన విమర్శించారు. దళితులు, గిరిజనుల ఓట్లనే ఎక్కువగా తొలగిస్తున్నారని, ఎమ్మెల్యేలు సర్ ప్రక్రియ పైన దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఇస్తు న్న అభివృద్ధి, సంక్షేమం దేశంలో ఎక్కడా ఇవ్వడం లేదని, సామాజిక న్యాయం తెలంగాణలోనే అమలవుతున్నదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిడ్డ కాకపోయినా బీసీ రిజర్వేషన్ల కోసం ముందుకు వచ్చారని, అయితే కేంద్ర ప్రభుత్వం సహకరించ డం లేదని మండిపడ్డారు. వచ్చే రెండున్నర సంవత్సరాలు కీలకమని ప్రతిఒక్కరు ఇప్పటినుంచి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తుచేశారు.

**బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోయింది..**

అసెంబ్లీ ఘటన తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ చాలా పడిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల 3 రోజుల పాటు అసెంబ్లీలో జరిగిన రాజకీయ పరిణామాలు, ప్రతిపక్షాల తీరుపై తాము ఓ ఫ్లాష్ సర్వే చేయించామని, ఈ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ భారీగా పడిపోయినట్లుగా స్పష్టమైందని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రు లు, విప్‌లు, ఎమ్మెల్యేలు అంతా సమన్వయంతో బాగా పనిచేశారని వారిని అభినందించా రు.రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22 ఏ నిషేధిత భూముల జాబితా అం శంపై ప్రతిపక్షాలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పేద ప్రజలకు, రైతాంగానికి మేలుచేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తుంటే, దాన్ని తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ నేతలు యత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై లబ్ధిపొందేందు కు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అదేవిధంగా మాజీ మంత్రి హరీష్‌రావుపై సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీష్‌రావు ధరణి పోర్టల్ ద్వారా అక్రమంగా రాయించుకున్న భూముల చిట్టా అంతా తమ వద్ద సిద్ధంగా ఉందని హెచ్చరించారు. త్వరలోనే బీఆర్ఎస్ నేతల అక్రమాలు, అవినీతికి సంబంధించిన పూర్తి చిట్టాను బయటపెడతామని స్పష్టంచేశారు. ప్రతిపక్ష నేతల బండారం ప్రజల ముందు బట్టబయలు చేస్తామని, ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

**పలు సమస్యలపై మంత్రులు..**

సీఎల్పీ సమావేశంలో కూడా వివి ధ సమస్యలపై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నీళ్ల సమస్యపైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. నీళ్ల కరువును తట్టుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందు కు వెళ్లుతోందని, అయితే ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వం విమర్శలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు బీఆర్ఎస్ హయాంలోనే అన్యాయం జరిగిందని, ఇ ప్పుడు తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం పోరాటం చేస్తున్న విషయాన్ని మంత్రి వివరించారు. ఇక జన గణనలో బీసీ కాలమ్ పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అందుకు కేంద్రంపై ఒత్తిడి మరింత ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఈగోలు వీడి ప్రజాసేవ చేద్దాం..

మొదటి పేజీ తరువాయి

**'వాటర్ మ్యాన్' గుర్తింపు ఎంతో సంతోషాన్నిచ్చింది**

తనకు 'గ్లోబల్ డ్రీమ్ కేబినెట్'లో చోటు దక్కినప్పుడు గానీ, 'సీఈఓ సీఎం' అని పిలిచినప్పుడు గానీ కలగని ఆనందం, 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించినప్పుడు కలిగిందని చంద్రబాబు అన్నారు. "రాష్ట్రంలోని భౌగోళిక అసమానతలను సరిచేస్తూ, నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాలకు నీరందించగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి–కావేరి–మహానది–గంగ వంటి నదులను అనుసంధానించి వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్‌స్టాపబుల్ అవుతుంది" అని ఆయన తన దార్శనికతను పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్–1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేశామని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలు.. ప్రస్తుత సవాళ్లు**

గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, వారి నిర్వాకం వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో మార్కెట్లోకి వచ్చిన 'జే' బ్రాండ్ల కల్తీ మద్యం కారణంగా సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వారి ఆరోగ్యం దెబ్బతింది. మేం అధికారంలోకి వచ్చాక ఆ కల్తీ బ్రాండ్లను రద్దు చేసి, పారదర్శకంగా విక్రయాలు జరిగేలా చూస్తున్నాం" అని తెలిపారు. విద్యుత్ టారిఫ్‌లు పెంచకుండానే నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పోలవరం వంటి ప్రాజెక్టులు పూర్తికాలేదని, జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర పథకాలను సరిగా వినియోగించుకోలేదని విమర్శించారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఇది నీటి భద్రతకు సవాలుగా మారిందని, ఇలాంటి సంక్షోభ సమయంలోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని పిలుపునిచ్చారు.

**సుపరిపాలన, టెక్నాలజీ వినియోగంపై దృష్టి**

ప్రో–యాక్టివ్ గవర్నెన్స్‌తో సుపరిపాలన అందించాలని, ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్లేనని సీఎం అన్నారు. "టెక్నాలజీని వినియోగించి 'డీప్ టెక్ గవర్నెన్సు'తో అనూహ్య ఫలితాలు సాధించాలి. డేటా లేక్, అవేర్ వంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి" అని సూచించారు. డీఎస్సీ నియామకాలపై కొందరు ఫేక్ ప్రచారం చేస్తున్నారని, దానిని ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా తిప్పికొట్టారని అభినందించారు. రెవెన్యూ శాఖలో 120 ఏళ్ల నాటి భూ సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని, 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో గ్రోత్ ఇంజన్లను గుర్తించి సంపద సృష్టించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్లను కోరారు. "మీ హయాంలో ఫలానా జిల్లాలో ఈ మంచి పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో అందరం కలిసి స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం కోసం పనిచేద్దాం" అని తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయోడైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

## ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం..

మొదటి పేజీ తరువాయి

**బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు**
**సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత**
**లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు**

సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## దివ్యాంగుల పింఛన్లపై సీతక్క కీలక ప్రకటన..

మొదటి పేజీ తరువాయి

**ఇప్పటివరకు 1,23,199 దరఖాస్తులు వచ్చాయని వెల్లడి**
**క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత పింఛన్లు మంజూరు చేస్తామని హామీ**
**అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని స్పష్టీకరణ**

క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హత ఉన్నవారికి పింఛన్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. థలసేమియా బాధితులకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని తెలిపారు.సదరం సర్టిఫికెట్లను గడువులోగా రెన్యువల్ చేసుకోకపోవడం వల్ల కొందరికి పింఛన్లు నిలిచిపోతున్నాయని సీతక్క చెప్పారు. అర్హులైన వారు తమ సదరం సర్టిఫికెట్లను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

## మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్

మొదటి పేజీ తరువాయి

చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

## తెలంగాణలో కరెంట్ వాడకం ఆల్-టైమ్ రికార్డ్..

మొదటి పేజీ తరువాయి

గతేడాది ఇదే రోజు (2025 సెప్టెంబర్ 9) రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15,906 మెగావాట్లుగా నమోదైంది. దానితో పోలిస్తే, కేవలం ఏడాది వ్యవధిలోనే డిమాండ్ 23 శాతం పెరిగింది. రాష్ట్రంలో వ్యవసాయ, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వాడకం గణనీయంగా పెరగడమే ఈ రికార్డు స్థాయి డిమాండ్‌కు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ స్థిరంగా పెరుగుతూ వస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 15,497 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్, 2023–24లో 15,623 మెగావాట్లకు, 2024–25లో 17,162 మెగావాట్లకు పెరిగి, తాజాగా 19,543 మెగావాట్ల మైలురాయిని దాటింది ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ, రాష్ట్ర విద్యుత్ సంస్థలు ముందుచూపుతో ప్రణాళికలు రచించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా డిమాండ్‌కు తగినట్లుగా సరఫరాను కొనసాగించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తక్షణ అవసరాలు, దీర్ఘకాలిక వ్యూహాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన నేడు ఇంధన శాఖపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో భవిష్యత్తులో పెరిగే డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## తిరుమల భక్తులకు టీటీడీ భరోసా.

మొదటి పేజీ తరువాయి

బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించడమే తమ లక్ష్యమని ఛైర్మన్ మీడియాకు తెలిపారు.

**బ్రహ్మోత్సవాల షెడ్యూల్, సీఎం పర్యటన**

సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. సెప్టెంబర్ 15న ఉత్సవాల ప్రారంభం రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. సెప్టెంబర్ 16న రిలయన్స్ సంస్థ విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించడంతో పాటు, టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..
# ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**
**అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ**
**అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య**
**ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు**
**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**



**హైదరాబాద్,సెప్టెంబర్10**

ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు.ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

# నిమజ్జనంతో ముగిసిపోదు.. మొక్కగా మళ్లీ పుట్టే గణేశుడు!

- **సీఎంసీ కమిషనర్‌కు విత్తన గణేష్ విగ్రహాన్ని అందజేసిన చిర్ర రవీందర్ యాదవ్**
- **పర్యావరణ పరిరక్షణకు విత్తన గణేష్ విగ్రహాలను ప్రోత్సహించాలని పిలుపు**
- **నిమజ్జనం అనంతరం మొలకెత్తి మొక్కగా ఎదిగేలా ప్రత్యేక రూపకల్పన**
- **కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు**



**సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి:**

వినాయక చవితి ఉత్సవాల్లో భక్తితోపాటు పర్యావరణ బాధ్యత కూడా కనిపించాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు చిర్ర రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజనను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి విత్తనాలతో రూపొందించిన గణేష్ విగ్రహాన్ని అందజేశారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారయ్యే విగ్రహాల నిమజ్జనం వల్ల జలవనరులు కలుషితమవుతున్న నేపథ్యంలో మట్టి, సహజ రంగులు, విత్తనాలతో రూపొందించే గణేష్ విగ్రహాలకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని రవీందర్ యాదవ్ కోరారు.విత్తన గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేసిన అనంతరం అందులోని విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదుగుతాయని తెలిపారు. పూజించిన గణనాథుడు ప్రకృతిలో కలిసిపోయి మొక్క రూపంలో మళ్లీ జీవం పోసుకోవడం పర్యావరణ హిత సంప్రదాయానికి నిదర్శనమని పేర్కొన్నారు.గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూనే చెరువులు, కుంటలు, ఇతర జలవనరులు కలుషితం కాకుండా ప్రతి

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై
# ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క



**రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి**
**ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి**
**విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం**

**హైదరాబాద్,సెప్టెంబర్10**

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు.ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్ల, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల కారణంగా ఒక్క మెగావాట్‌కు రూ. 1.30 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. కేంద్రం నిబంధనలు సడలిస్తే పెట్టుబడులు మరింత పెరుగుతాయని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందని.. పారిశ్రామిక వృద్ధితో డిమాండ్ భారీగా పెరుగుతోందన్నారు. మరోవైపు, విద్యుత్ సబ్సిడీల కోసం ఏటా రూ. 19 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.అలాగే, సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపైనా కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు. ఈ మేరకు అమ్రాబాద్‌లో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇందుకోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. అలాగే, సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలకు భట్టి విక్రమార్క సూచించారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి రాజనర్సింహ



**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వారు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్ఎస్ సదుపాయం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. అర్హులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఓటీపీతో హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారుగురువారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈహెచ్ఎస్ కింద ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ కేటాయించామని చెప్పారు. నెలకు రూ.88 కోట్ల నిధులు సమకూరుతున్నాయని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు 1.5 శాతం చొప్పున చెల్లింపు.. ప్రభుత్వం కూడా అంతే మొత్తం చెల్లిస్తుందని పేర్కొన్నారు.921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఆ జాబితాలో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ-ఆథరైజేషన్ చేసినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

# డప్పు కొడితే.. కేసీఆర్ ఫాంహౌస్ మైలపడిందా?: అద్దంకి దయాకర్



**సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలకు ఎందుకంత కడుపుమంట అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై దాడులకు ఫాంహౌస్ నుంచి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.**

**హైదరాబాద్, ఆగస్టు 10:**

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. డప్పు కొడితే.. కేసీఆర్ ఫాంహౌస్ మైలపడిందా? అని బీఆర్ఎస్ పార్టీ నేతలను సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలకు ఎందుకంత కడుపుమంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు అసెంబ్లీతో పని లేదు.. ప్రజలతో పనిలేదని ఎద్దేవా చేశారు. దళితులపై దాడులకు ఫాంహౌస్ నుంచి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వాళ్లే తప్పులు చేసి.. తమపై నిందలు వేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ నిప్పులు చెరిగారు.తెలంగాణ అసెంబ్లీ వర్షా కాల సమావేశాలు.. సెప్టెంబర్ 7వ తేదీన ప్రారంభమయాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలన విఫలమంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నిరసనకు పిలుపునిచ్చింది. దాంతో నల్ల టీ షర్టులు ధరించి అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ అగ్రనేతలు నిరసనలు తెలిపారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, విజయ్ కుమార్ రెడ్డి.. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు.ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఎర్రవెల్లిలోని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఫాంహౌస్ వద్ద వెయ్యి డప్పుల మోతకు పిలుపునిచ్చింది. ఆ క్రమంలో వెయ్యి డప్పులు మోత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆ ప్రదేశాన్ని బీఆర్ఎస్ శ్రేణులు శుద్ధి చేశాయి. బీఆర్ఎస్ చర్యను కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ ప్రారంభం నాటి నుంచి ఎర్రవెల్లిలో శుద్ధి కార్యక్రమం వరకు అంతా ఫాంహౌస్ వేదికగా జరిగిన కుట్ర అని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది.

# ఏపీకి మరో కీలక రైల్వే ప్రాజెక్టు.. కేంద్రానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ధన్యవాదాలు

**రేణిగుంట-అరక్కోణం మధ్య 3, 4వ రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం**
**ఏపీలో కనెక్టివిటీకి ఇది మరో పెద్ద ఊతమన్న సీఎం చంద్రబాబు**
**ఈ ప్రాజెక్టు కోసం రూ.1,157 కోట్లు కేటాయించినట్లు వెల్లడి**
**తిరుపతి, రాయలసీమకు ప్రయోజనం కలుగుతుందన్న డిప్యూటీ సీఎం పవన్**
**ప్రధాని మోదీ, రైల్వే మంత్రికి ఇరువురు నేతల కృతజ్ఞతలు**



**అమరావతి,సెప్టెంబర్10,**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేణిగుంట-అరక్కోణం సెక్షన్‌లో మూడవ, నాలుగవ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని తిరుపతి, చిత్తూరు జిల్లాలకు మేలు జరగనుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఎన్డీయే డబుల్ ఇంజిన్, బుల్లెట్ ట్రైన్ సర్కార్ హయాంలో ఆంధ్రప్రదేశ్ కనెక్టివిటీకి మరో పెద్ద ఊతం లభించింది. రేణిగుంట-అరక్కోణం సెక్షన్‌లో 3వ, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఏపీ పరిధిలోని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 46 కిలోమీటర్ల మేర రూ.1,157 కోట్ల వ్యయంతో పనులు జరుగుతాయి" అని ఆయన పేర్కొన్నారు. ఈ కొత్త లైన్ల నిర్మాణంతో రైళ్ల రద్దీ తగ్గడమే కాకుండా, రైళ్ల రాకపోకల్లో సమయపాలన మెరుగుపడుతుందని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా తిరుపతికి వెళ్లే యాత్రికులు, ప్రయాణికులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, సరుకు రవాణా కూడా వేగవంతమవుతుందని ఆయన అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల బలోపేతానికి కేంద్రం నిరంతరం మద్దతు ఇస్తోందని కొనియాడారు. "దేశవ్యాప్తంగా రూ.10,021 కోట్ల విలువైన ఐదు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులతో భారతీయ రైల్వే నెట్‌వర్క్ రూపురేఖలు మారనున్నాయి. దీనిద్వారా దాదాపు 540 కిలోమీటర్ల కొత్త సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది" అని ఆయన తెలిపారు. అరక్కోణం-రేణిగుంట 3, 4వ లైన్ల నిర్మాణం వల్ల తిరుపతికి, రాయలసీమ ప్రాంతానికి కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. దీనివల్ల రద్దీ తగ్గి పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్ రంగాలకు పెద్దపీట వేసినట్లు అవుతుందని, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తం 17 జిల్లాలు, 2,121 గ్రామాలు, దాదాపు 52 లక్షల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ప్రతి కొత్త ట్రాక్ ప్రజలను అవకాశాలతో, వ్యాపారాలను మార్కెట్లతో అనుసంధానం చేస్తుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

# కరెంట్ కోసం నీళ్లివ్వం.. తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ స్పష్టీకరణ





**సాగు, తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేఆర్ఎంబీ ఆదేశం**
**ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని తెలుగు రాష్ట్రాలకు సూచన**
**నీటి పంపకాలపై ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి భగ్గుమన్న విభేదాలు**
**66:34 నిష్పత్తిలో నీరు కేటాయించాలని కోరుతున్న ఆంధ్రప్రదేశ్**
**50:50 వాటా కావాలని డిమాండ్ చేస్తున్న తెలంగాణ**

**అమరావతి,సెప్టెంబర్10,**

ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని ఉభయ తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సూచించింది. ఉమ్మడి జలాశయాల నుంచి కేవలం విద్యుదుత్పత్తి కోసం నీటిని విడుదల చేయడం సాధ్యపడదని స్పష్టం చేసింది. తాగునీటికి ప్రథమ, సాగునీటికి ద్వితీయ ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే మిగిలిన అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని బోర్డు తేల్చి చెప్పింది. ఈ మేరకు సెప్టెంబరు 4న కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కంబోజ్ నేతృత్వంలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశ మినిట్స్‌ను బోర్డు ఇరు రాష్ట్రాలకు పంపింది. 2026 సెప్టెంబరు నుంచి 2027 ఆగస్టు వరకు సాగునీటి కేటాయింపులపై ఈ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ అంశాన్ని త్వరలో జరగనున్న 21వ కేఆర్ఎంబీ పూర్తిస్థాయి సమావేశంలో చర్చించనున్నారు. అయితే, ఈ సమావేశ మినిట్స్‌లో వాస్తవాలను పొందుపరచలేదని, వాటిని తాము అంగీకరించడం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ రమేశ్ బాబు కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు లేఖ రాశారు. మరోవైపు, తమ రాష్ట్రంలో తాగునీటి సరఫరా, చెరువుల నింపడం కోసం వచ్చే ఏడాది ఆగస్టు వరకు 104 టీఎంసీల నీరు అవసరమని ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ బోర్డుకు విన్నవించారు. సెప్టెంబరు 3 నాటి నీటి నిల్వల ప్రకారం 66:34 నిష్పత్తిలో తమ వాటాకు రావాల్సిన 97.41 టీఎంసీలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. దీనికి భిన్నంగా, నీటి పంపిణీ 50:50 ప్రాతిపదికన జరగాలని తెలంగాణ ఈఎన్‌సీ డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూల్ 12 ప్రకారమే నీటి వినియోగ ప్రాధాన్యతలను నిర్దేశించినట్లు బోర్డు స్పష్టం చేసింది.

# తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత.. భక్తుల భయాందోళన

**తిరుమల అలిపిరి నడకమార్గంలో మరోసారి చిరుత సంచారం**
**7వ మైలు వద్ద చిరుతను చూసి భయపడిన భక్తులు**
**నరసింహస్వామి ఆలయం సమీపంలోనూ కనిపించినట్లు సమాచారం**
**భక్తులను గుంపులుగా మాత్రమే అనుమతిస్తున్న తితిదే**
**నడకమార్గంలో భద్రతను పెంచి, నిఘా ఏర్పాటు చేసిన అధికారులు**



**అమరావతి,సెప్టెంబర్10**

తిరుమల శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులను వన్యమృగాల భయం మరోసారి వెంటాడింది. అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మెట్ల మార్గంలో 7వ మైలు దాటిన తర్వాత మండపం సమీపంలో చిరుత కనిపించడంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు భయంతో కేకలు వేస్తూ వెనక్కి పరుగులు తీశారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నరసింహస్వామి ఆలయానికి సమీపంలో చిరుత సంచరించినట్లు కొందరు భక్తులు తెలిపారు. తాజాగా 7వ మైలు వద్ద మరోసారి కనిపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుస ఘటనలతో నడకమార్గంలో వెళ్లేందుకు భక్తులు జంకుతున్నారు. ముఖ్యంగా పిల్లలతో, వృద్ధులతో కలిసి ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమాచారం అందిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజిలెన్స్ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడకమార్గంలో కీలక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులను ఒంటరిగా అనుమతించకుండా, గుంపులుగా మాత్రమే పంపిస్తున్నారు. చిరుత సంచరించినట్లు చెప్పిన ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది గస్తీని ముమ్మరం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ధైర్యంగా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా, తిరుమల నడకమార్గంలో చిరుతల సంచారం కొత్తేమీ కాదు. గతంలోనూ పలుమార్లు చిరుతలు, ఎలుగుబంట్లు కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురైన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో కూడా టీటీడీ ఇలాంటి భద్రతా చర్యలనే అమలు చేసింది.

# రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి: అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



**రివ్యూలతో కాలయాపన వద్దు, ఫలితాలు చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టీకరణ**
**ప్రో-యాక్టివ్‌గా పనిచేస్తూ, అభివృద్ధిలో జిల్లాలు, శాఖలు పోటీ పడాలని దిశానిర్దేశం**
**'సీఈఓ' గుర్తింపు కన్నా 'వాటర్ మ్యాన్' అని పిలిపించుకోవడమే తనకు సంతృప్తి అన్న సీఎం**
**నకిలీ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, వాస్తవ నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచన**
**'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'తో స్వర్ణాంధ్ర సాధన సాధ్యమన్న చంద్రబాబు**

**అమరావతి,సెప్టెంబర్10**

"గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్**

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం**

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. "గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

**టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం**

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని, నకిలీ ప్రచారాలను తిప్పికొట్టాలిప్రతి జిల్లాలో 25 ప్రధాన ప్రాజెక్టులను, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించి వాటిని పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. జిల్లాలో 'గ్రోత్ ఇంజన్లను' గుర్తించి సంపద సృష్టించాలని సూచించారు. "టెక్నాలజీని అందిపుచ్చుకుని 'డీప్ టెక్ గవర్నెన్స్' ద్వారా నిర్ణయాల్లో వేగం, సేవల్లో నాణ్యత పెంచాలి. కొందరు పనిగట్టుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. వాటిని వెంటనే గుర్తించి, వాస్తవాలతో తిప్పికొట్టాలి. డీఎస్సీ-2025 విషయంలో ఇద్దరు మహిళా అధికారులు సమర్థంగా స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచారు. వారిని అభినందిస్తున్నాను" అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలోని 'జే బ్రాండ్' మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని, తాము కల్తీ బ్రాండ్లను రద్దు చేసి పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, నీటి భద్రత ఒక సవాలుగా మారిందని, అయినా తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ పడబోమని హామీ ఇచ్చారు. సంక్షోభ సమయాల్లోనే కలెక్టర్ల నాయకత్వ పటిమ బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు.

# కోర్టుకెక్కితే బెడిసికొట్టింది.. అక్రమ భవనం సీల్ చేయాలని హైకోర్టు ఆదేశం!



**అక్రమ నిర్మాణంపై కోర్టుకెక్కిన యజమానికి చుక్కెదురు**

**సిద్దంబర్ బజార్‌లోని ఐదంతస్తుల భవనాన్ని సీల్ చేయాలని ఆదేశం**

**నిర్మాణ స్థలాల వద్ద పర్మిషన్ వివరాలు ప్రదర్శించడం తప్పనిసరి**

**రూ.1 రిజిస్ట్రేషన్ స్కీమ్‌ను దుర్వినియోగం చేసినట్లు గుర్తించిన న్యాయస్థానం**

**అక్రమ నిర్మాణాలపై మొదటి దశలోనే చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీకి సూచన**

**హైదరాబాద్,సెప్టెంబర్10**

అక్రమ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించాలని కోరుతూ కోర్టుకెక్కిన ఓ భవన యజమానికి తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమనం ఇవ్వకపోగా, ఆ అక్రమ భవనాన్ని తక్షణమే సీల్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని ఆదేశించింది. అంతేకాకుండా, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నిర్మాణ స్థలం వద్ద తప్పనిసరిగా బిల్డింగ్ పర్మిషన్ వివరాలను ప్రదర్శించాలని కీలకమైన ఆదేశాలు జారీ చేసింది.

**అసలేం జరిగిందంటే..**

హైదరాబాద్ పాతబస్తీలోని సిద్దంబర్ బజార్‌లో రాజ్ కుమార్ అనే వ్యాపారికి చెందిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఆగస్టు 5, 2026న నిర్మాణాన్ని ఆపాలని ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ నిర్మాణం కొనసాగడంతో, తన అదనపు నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్లు 455–ఎ, 455–ఎఎ కింద రెగ్యులరైజ్ చేయాలంటూ రాజ్ కుమార్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

**రూ.1 స్కీమ్‌తో మోసం**

ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం.. పిటిషనర్ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించింది. జీహెచ్ఎంసీ వాదనల ప్రకారం, రాజ్ కుమార్‌కు మొత్తం 114.14 చదరపు గజాల స్థలం ఉండగా, కేవలం 43.29 చదరపు మీటర్లకే తన పేరు మీద పర్మిషన్ తీసుకున్నారు. మిగిలిన భాగాన్ని మరో ముగ్గురి పేర్ల మీద చూపించారు. 75 గజాల లోపు ప్లాట్లకు వర్తించే తెలంగాణ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్ (టీఎస్-బీపాస్) కింద ఉన్న ?1 టోకెన్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని దుర్వినియోగం చేసేందుకే ఇలా చేశారని జీహెచ్ఎంసీ కోర్టుకు వివరించింది. నిబంధనల ప్రకారం, 75 గజాల కంటే పెద్ద ప్లాట్‌ను ఇలా విభజించి మినహాయింపులు పొందడం చట్టవిరుద్ధం.

**కోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

జీహెచ్ఎంసీ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, పిటిషనర్‌కు ఉపశమనం కల్పించేందుకు ఎలాంటి ఆధారాలు లేవని తేల్చి చెప్పింది. నిబంధనల ప్రకారం అంత చిన్న స్థలంలో కేవలం గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన నిర్మాణాన్ని కొనసాగించే హక్కు రాదని, ముఖ్యంగా ఆస్తికి సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఇది వర్తించదని జస్టిస్ విజయసేన్ రెడ్డి తేల్చిచెప్పారు. సెల్ఫ్–సర్టిఫికేషన్ విధానాన్ని దుర్వినియోగం చేయడం ఆందోళన కలిగించే ధోరణి అని వ్యాఖ్యానించిన హైకోర్టు, అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించకుండా, అవి పూర్తయ్యే వరకు అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని జీహెచ్ఎంసీని ప్రశ్నించింది. సిద్దంబర్ బజార్, బేగంబజార్ ప్రాంతాల్లోని నిర్మాణాలను తనిఖీ చేసి, అక్రమ కార్యకలాపాలను అడ్డుకుని, నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ప్రజలకు, అధికారులకు సులభంగా తెలిసేలా ఇకపై చిన్న ప్లాట్లతో సహా అన్ని నిర్మాణాల వద్ద పర్మిషన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

# రాహుల్‌కు ఇటాలియన్‌లో లేఖ.. ఫీజు బకాయిలపై బీజేపీ చీఫ్ వినూత్న నిరసన

**హైదరాబాద్,సెప్టెంబర్10**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్ గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన "మాతృభాష" అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు రామచందర్ రావు ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# మూసీ ప్రక్షాళనకు కౌంట్‌డౌన్.. దసరా రోజు తొలి దశ పనులకు శ్రీకారం!

**దసరాకు మూసీ తొలి దశ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు**

**మొదటి విడత కోసం రూ.7,345 కోట్లతో ఇప్పటికే పరిపాలన అనుమతులు**

**ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణ సమీకరణ.. మంజూరు ప్రక్రియ చివరి దశలో**

**ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు అభివృద్ధి పనులు**

**నదిలో బోటింగ్, ఇరువైపులా రోడ్లు, సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టనున్న ప్రభుత్వం**



**హైదరాబాద్,సెప్టెంబర్10**

హైదరాబాద్ వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు పనులకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు తొలి దశ (ఫేజ్–1) పనులను దసరా పండుగ రోజున ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ నగరానికి కొత్త అందాలు తీసుకువచ్చే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని ప్రక్రియలను అధికారులు వేగవంతం చేశారు. తొలి దశ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.7,345.12 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులలో రూ.4,500 కోట్లను ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రుణంగా తీసుకోనున్నారు. మిగిలిన రూ.2,845.12 కోట్లను హెచ్ఎండీఏ, టీజీఐఐసీ సంస్థల ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అధికారులు ఫేజ్–1 సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) ఏడీబీకి సమర్పించగా, రుణ మంజూరు ప్రక్రియ చివరి దశలో ఉన్నట్లు సమాచారం. దీంతో దసరా నాటికి శంకుస్థాపన చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

**రెండు మార్గాల్లో అభివృద్ధి పనులు**

మూసీ నది వాస్తవానికి అనంతగిరి కొండల్లో మూసా, ఈసీ అనే రెండు పాయలుగా పుడుతుంది. ఈసీ నదిపై హిమాయత్‌సాగర్, మూసా నదిపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయాలు ఉన్నాయి. ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు ప్రవహించి, లంగర్‌హౌజ్ సమీపంలోని బాపూఘాట్ వద్ద కలిసిపోయి మూసీ నదిగా ప్రవహిస్తుంది. ఫేజ్–1లో భాగంగా, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.2 కిలోమీటర్లు, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.8 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ రెండు పనులను ఒకేసారి పూర్తిచేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నదిలో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించడం, నీటిని నిల్వ చేసి బోటింగ్ వంటి సదుపాయాలు కల్పించడం, నదికి ఇరువైపులా సుందరమైన రోడ్లు, ల్యాండ్‌స్కేపింగ్, సైకిల్ ట్రాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ముఖ్యంగా, నగరంలోని మురుగు నీరు నదిలో కలవకుండా ఇరువైపులా భారీ ట్రంక్ లైన్లు, వర్షపు నీటి డ్రెయిన్లను ఏర్పాటు చేయనున్నారు. ఫేజ్–1 పనులు ప్రారంభమైన తర్వాత, హైదరాబాద్ గేట్‌వే నిర్మాణ పనులపై దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు, నాగోలు నుంచి గౌరెల్లి వరకు చేపట్టనున్న రెండో దశ (ఫేజ్–2) పనుల డీపీఆర్ తయారీ ప్రక్రియను కూడా వేగవంతం చేశారు.

# కులగణనకు తెలంగాణ మోడల్ కావాలి..



**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.**

**హైదరాబాద్,సెప్టెంబర్10**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి.

**బీఆర్ఎస్ కుట్రను తిప్పికొట్టారు**

ఈ సందర్భంగా శాసనసభను సజావుగా సాగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకునే వ్యూహం రూపొందించారని విమర్శించారు. అధికారం కోల్పోయినా వారు అహంకారం వీడలేదని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు తాను కనిపించినట్టు ఉన్నానని, అంత ఆక్రోశంతో వారిపై ఆయన దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచితంగా వ్యవహరించారని, మహిళా అధికారుల ఎదుట చొక్కాలు విప్పి ఇబ్బంది కలిగించారని మండిపడ్డారు. శాసనసభాపతినీ అత్యంత అభ్యంతరకరంగా దూషించారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ఆ పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టి ప్రభుత్వానికి అండగా నిలిచారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి అభినందించారు.

**ప్రజలు గమనిస్తున్నారు..**

ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు. ఈ సందర్భంగా శాసనసభలో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని, నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఆదేశించారు. ప్రజలు అప్పగించిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే రాజకీయ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

**కులగణనకు తెలంగాణ మోడల్ కావాలి..**

దేశానికి తెలంగాణ చేపట్టిన కులగణన ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే ఓటర్ల జాబితాలో 88 కోట్ల మంది మాత్రమే ఉన్నారని ఆరోపించారు. ఈ లెక్కలతో భారీగా ఓట్లు గల్లంతయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

**వెయ్యి రోజుల పాలనలో ఎన్నో కార్యక్రమాలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సభ నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో పార్టీ ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలను దేశంలో ఎక్కడా లేని విధంగా ముందుకు తీసుకెళ్లామని, వాటి ఫలితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఇదిలా ఉండగా.. సభ్యులందరికీ వెసులుబాటు కల్పించేలా అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలి నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్న విషయాన్నీ సమావేశంలో రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.

# కనీస వేతనాలు చెల్లించడంలో దేశానికి తెలంగాణ ఆదర్శం: మంత్రి వివేక్

**హైదరాబాద్, సెప్టెంబర్10:**



కనీస వేతనాలు చెల్లించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. గురువారం తెలంగాణ అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. అయితే ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలపై ప్రభుత్వం కమిటీ వేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నదీమ్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. అందుకోసం త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ వెంకట స్వామి ప్రకటించారు.

# ఢిల్లీలో ఒకేరోజు.. బ్రిక్స్ సదస్సుకు వీవీఐపీల కాన్వాయ్‌లు, టీ20 కోసం 35,000 మంది ఫ్యాన్స్

**ఢిల్లీలో ఒకేరోజు బ్రిక్స్ సదస్సు, భారత్-ఆఫ్ఘన్ ౨20 మ్యాచ్**
**భద్రతా కారణాలతో మ్యాచ్‌ను వాయిదా వేయాలని కోరిన పోలీసులు**
**సుమారు 35,000 మంది అభిమానులు వస్తారని అంచనా**
**చర్చల తర్వాత మ్యాచ్ యథాతథంగా జరుగుతుందని డీడీసీఏ స్పష్టత**
**ట్రాఫిక్, భద్రతా నిర్వహణ ఢిల్లీ పోలీసులకు పెను సవాల్**




**న్యూఢిల్లీ,సెప్టెంబర్10,**

ఢిల్లీలో ఒకేరోజు రెండు కీలక కార్యక్రమాలు జరగనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు ముగింపు రోజైన సెప్టెంబర్ 13వ తేదీనే, అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత్-ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య తొలి టీ20 మ్యాచ్‌ను యథాతథంగా నిర్వహించనున్నట్లు ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) ప్రకటించింది. ఈ పరిణామంతో దేశ రాజధానిలో భద్రతను పర్యవేక్షించడం, ట్రాఫిక్ నియంత్రించడం ఢిల్లీ పోలీసులకు పెను సవాలుగా మారింది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు విచ్చేసే విదేశీ ప్రతినిధులు, వీవీఐపీల భద్రతతో పాటు వారి కాన్వాయ్‌ల రాకపోకల కోసం ట్రాఫిక్ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు. ఇదే సమయంలో, సెప్టెంబర్ 13న జరిగే క్రికెట్ మ్యాచ్‌కు దాదాపు 25,000 నుండి 35,000 మంది ప్రేక్షకులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఒకేసారి రెండు ప్రధాన కార్యక్రమాలు కావడంతో నగరంలోని డీడీయూ మార్గ్, బీఎస్‌జడ్ మార్గ్, మింటో రోడ్ వంటి కీలక ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు బలగాల్లో అత్యధిక శాతం బ్రిక్స్ సదస్సు బందోబస్తులోనే నిమగ్నమై ఉన్నందున, మ్యాచ్‌ను వాయిదా వేయాలని లేదా ఇతర తేదీలకు మార్చాలని డీడీసీఏని పోలీసులు కోరారు. అయితే, ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో జరిపిన చర్చల అనంతరం, మ్యాచ్ నిర్వహణకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ లభించిందని డీడీసీఏ వెల్లడించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం మ్యాచ్ నిర్వహణకే మొగ్గు చూపినట్లు స్పష్టం చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఒకేవైపు వీవీఐపీల భద్రత, మరోవైపు వేలాది మంది అభిమానుల రద్దీ నియంత్రణను ఢిల్లీ యంత్రాంగం ఏ విధంగా సమన్వయం చేస్తుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు..



**ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోందన్న సిద్ధరామయ్య**
**100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం, కేబినెట్‌కు అభినందనలు**
**ఏడాదికి రూ.52,000 కోట్లతో ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని వెల్లడి**
**బీజేపీ బళ్లారి పాదయాత్రను ఒక రాజకీయ జిమ్మిక్కుగా అభివర్ణన**
**కరువు సాయం కోసం కేంద్రంపై ఆధారపడొద్దని ప్రభుత్వానికి సూచన**


**న్యూఢిల్లీ,సెప్టెంబర్10,**

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

**ఏఐ టెక్నాలజీతో ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోల సృష్టి**
**కొన్ని పథకాలలో పెట్టుబడులు పెట్టాలంటూ మోసపూరిత ప్రచారం**
**ఇవి పూర్తిగా నకిలీవని స్పష్టం చేసిన ఆమె కార్యాలయం**
**వీటిని నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు హెచ్చరిక**
**అనుమానాస్పద పోస్టులను రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్10,**



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది. కొన్ని సంస్థలు, పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ప్రియాంక గాంధీ స్వయంగా ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించారు. ఇందుకోసం ఆమె ఛాయాచిత్రాలతో పాటు, ఏఐ ద్వారా ఆమె గొంతును (వాయిస్ క్లోనింగ్) అనుకరించారు. ఇవి అచ్చం ఆమె గొంతులాగే ఉండటంతో ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉందని ఆమె కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వీడియోలు పూర్తిగా నకిలీవని, మోసపూరితమైనవని ప్రియాంక గాంధీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిని నమ్మి ఎవరూ నగదు పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఇటువంటి వీడియోలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు కనిపిస్తే వెంటనే వాటిని రిపోర్ట్ చేసి, ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రజలకు సూచించింది. డీప్‌ఫేక్ సాంకేతికతను అడ్డుపెట్టుకుని ప్రముఖుల పేర్లతో సాగుతున్న ఆర్థిక మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది.

# రహదారి నిర్మాణంలో ఆలస్యం.. ప్రారంభోత్సవానికి రాబోనన్న గడ్కరీ



**దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న ముంబై-గోవా హైవే పనులు**
**ఆలస్యంపై గడ్కరీ తీవ్ర అసంతృప్తి**
**పూర్తయినా ప్రారంభోత్సవానికి రానన్న మంత్రి**
**అక్టోబర్‌లో రోడ్డుమార్గంలో గోవాకు వెళ్లి పరిశీలిస్తానని వెల్లడి**
**ప్రాజెక్టుకు దాదాపు రూ.16 వేల కోట్ల ఖర్చు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్10,**

ముంబై-గోవా హైవే విస్తరణ పనులు ఏళ్ల తరబడి సాగుతుండటంపై కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు 15 ఏళ్లుగా పూర్తికాని ఈ ప్రాజెక్టు విషయంలో తనకు సిగ్గుగా ఉందని అన్నారు. పనులు పూర్తయినా ప్రారంభోత్సవానికి తాను రానని స్పష్టం చేశారు. బదులుగా అక్టోబర్‌లో ముంబై నుంచి గోవాకు రోడ్డుమార్గంలో ప్రయాణించి పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తానన్నారు. పనాజీ సమీపంలోని పొర్వోరిమ్‌లో కొత్తగా నిర్మించిన ఆరు వరుసల ఎలివేటెడ్ రోడ్డు కారిడార్‌ను ప్రారంభించిన సందర్భంగా గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్‌లో ముంబై విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి గోవా వరకు రోడ్డుమార్గంలో వెళ్తానని చెప్పారు. ప్రయాణికులకు రహదారి నిజంగా ఎంత సౌకర్యంగా మారిందో స్వయంగా చూస్తానన్నారు. పనుల్లో జాప్యానికి, నాణ్యత లోపాలకు కారణమైన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేయడంతో పాటు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేయబోనని స్పష్టం చేశారు.

**15 ఏళ్లుగా సాగుతున్న పనులు**

ముంబై-గోవా హైవే విస్తరణ పనులు 2011లో మొదలయ్యాయి. పాత రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలకు విస్తరించి, ముంబై-గోవా ప్రయాణ సమయాన్ని దాదాపు 12 గంటల నుంచి ఆరు గంటలకు తగ్గించాలన్నది లక్ష్యం. 2016కే పనులు పూర్తికావాల్సి ఉన్నా.. పలుమార్లు గడువులు మారాయి. 485 కిలోమీటర్ల పనుల్లో 465 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా పూర్తయ్యాయని ఫిబ్రవరిలో కేంద్రం పార్లమెంటుకు తెలిపింది. మిగిలిన 20 కిలోమీటర్ల పనులకు జూన్ 2026 గడువు పెట్టినా అది కూడా దాటిపోయింది. ప్రస్తుతం పనులు 93-94 శాతం పూర్తయినట్లు గడ్కరీ చెబుతున్నారు.

**రూ.16 వేల కోట్ల ఖర్చు.. ఇంకా ఇబ్బందులే**

ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు దాదాపు రూ.16 వేల కోట్లు ఖర్చయ్యాయి. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కాంట్రాక్టర్ల వైఫల్యం, పనుల నెమ్మదితనం వంటివి జాప్యానికి కారణాలుగా ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు ఇటీవల నిర్మించిన కొన్ని రహదారి భాగాల్లో వర్షాలకు గుంతలు ఏర్పడటంతో నాణ్యతపైనా విమర్శలు వచ్చాయి. వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులు, నీటిముంపు, మరమ్మతులతో ఇబ్బందులు పడుతున్నారు. ఖర్పాడా టోల్ ప్లాజాలో టోల్ వసూలు మొదలైనప్పటికీ పలు వంతెనలు, బైపాస్‌లు ఇంకా పూర్తికాలేదు. మొత్తం పనులు పూర్తయితే ముంబై, కొంకణ్, గోవా మధ్య ప్రయాణం సులభం కావడంతో పాటు పర్యాటకం, స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది.

# 'బ్రిక్స్'తో భారత్‌కు ఏం లాభం? చిదంబరం ప్రశ్న.. బీజేపీ ఘాటు కౌంటర్

**గత సదస్సుల్లో చెప్పుకోదగ్గ ఫలితాలు లేవన్న కాంగ్రెస్ నేత చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర విమర్శలు**
**దౌత్యంపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించిన నళిన్ కోహ్లీ**
**ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13న బ్రిక్స్ సదస్సు**
**2026 జనవరి నుంచి భారత్ వద్ద బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్10,**

భారత్‌కు బ్రిక్స్, ఎస్‌సీఓ, జీ20, క్వాడ్ వంటి అంతర్జాతీయ కూటముల నుంచి ఏం ప్రయోజనం కలుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ప్రశ్నించారు. గత రెండు, మూడు బ్రిక్స్ సదస్సుల్లో భారత్‌కు చెప్పుకోదగ్గ ప్రయోజనాలు కనిపించలేదని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. "గత రెండు, మూడు బ్రిక్స్ సదస్సుల వల్ల భారత్‌కు స్పష్టమైన ప్రయోజనాలు కనిపించలేదు. గతంలో జరిగిన సదస్సులతో మాత్రం కొన్ని ప్రయోజనాలు వచ్చాయి" అని చిదంబరం అన్నారు. బ్రిక్స్‌తో పాటు ఎస్‌సీఓ, జీ20, క్వాడ్‌లోనూ భారత్ సభ్య దేశంగా ఉందని గుర్తుచేశారు. అయితే వీటి నుంచి దేశానికి ఏం దక్కుతోందో తనకు కనిపించడం లేదన్నారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్‌కు దౌత్య విధానంపై అవగాహన ఉందా? అంటూ బీజేపీ నేత నళిన్ కోహ్లీ ప్రశ్నించారు. దౌత్య సంబంధాలను కేవలం 'ఇచ్చిపుచ్చుకోవడం' కోణంలోనే కాంగ్రెస్ చూస్తోందా? అని నిలదీశారు. కీలకమైన అంతర్జాతీయ కార్యక్రమంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో బ్రిక్స్ సదస్సు జరగనుంది. 2026 జనవరి 1 నుంచి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు భారత్ చేపట్టింది. 'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నొవేషన్, కోఆపరేషన్, సస్టైనబిలిటీ' అనే థీమ్‌తో భారత్ ఈ బాధ్యతలు నిర్వహిస్తోంది. బ్రిక్స్‌లో బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, భారత్, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యూఏఈ ఉన్నాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు దేశాధినేతలు సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రపంచ జనాభాలో దాదాపు 49 శాతం, ప్రపంచ జీడీపీలో సుమారు 40 శాతాన్ని బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయి.

# మలబద్ధకం సమస్యకు ఇదే బెస్ట్!

**మలబద్ధకం నివారణకు బొప్పాయి ఉత్తమమైన పండు**
**చిలగడదుంప, ఖప్లీ గోధుమ పిండితో మంచి ఫలితం**
**జీర్ణక్రియను సులభం చేసే అవిసె గింజలు, బాదం**
**ఫైబర్ ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు నీరు తాగడం ముఖ్యం**
**ఇవి పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ సూచనలు**



ప్రస్తుత జీవనశైలిలో చాలా మంది ఎదుర్కొంటున్న సాధారణ సమస్య మలబద్ధకం. దీని నుంచి బయటపడటానికి సహజమైన మార్గాల కోసం చూసేవారికి ప్రముఖ పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ కొన్ని కీలకమైన సూచనలు చేశారు. మలబద్ధకాన్ని ఎదుర్కోవడానికి ఉత్తమమైన పండు 'బొప్పాయి' అని ఆమె స్పష్టం చేశారు. బొప్పాయిలో ఉండే 'పపైన్' అనే ఎంజైమ్, ప్రొటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుందని వివరించారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది. బొప్పాయితో పాటు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచే మరికొన్ని ఆహార పదార్థాలను కూడా ఆమె సిఫార్సు చేశారు. వాటిలో కొన్ని:

**కూరగాయ:**

చిలగడదుంప. ఇందులో ఉండే అధిక ఫైబర్, నీటి శాతం మలాన్ని తేలికగా ముందుకు కదిలేలా చేస్తుంది.
పిండి: ఖప్లీ (ఎమ్మర్) గోధుమ పిండి. పొట్టుతో ఉండటం వల్ల ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది.

**గింజలు:**

అవిసె గింజలు. ఇవి పేగుల్లో కదలికలను సులభతరం చేస్తాయి.

**నట్స్:**

బాదం పప్పులు. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం జీర్ణాశయ కండరాలకు విశ్రాంతినిస్తాయి. అయితే, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకున్నప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యమని సోనియా నారంగ్ నొక్కిచెప్పారు. నీరు సరిగ్గా తీసుకోకపోతే మలబద్ధకం సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సూచనలు కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమేనని, దీర్ఘకాలంగా ఈ సమస్యతో బాధపడేవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని ఆమె స్పష్టం చేశారు.

# వర్షాకాలంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు ఇవే!

**వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలపై నిపుణుల సూచనలు**
**విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, నిమ్మ వంటి పండ్లను తినాలని సలహా**
**వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడతాయని వెల్లడి**
**తేమ వాతావరణంలో వచ్చే వ్యాధుల నుంచి ఈ ఆహారాలు రక్షణ కల్పిస్తాయని నివేదిక**
**వేడిగా వండిన ఆహారం తినడం, పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని సూచన**



వర్షాకాలం ప్రారంభంతో వాతావరణంలో తేమ శాతం పెరిగి, ఇన్ఫెక్షన్లు ప్రబలే ప్రమాదం అధికమవుతుంది. ఈ సీజనల్ వ్యాధుల బారి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించే కొన్ని ప్రత్యేక ఆహారాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీరం సహజ రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవచ్చని వారు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడే పలు ముఖ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో విటమిన్-సి పుష్కలంగా ఉండే నారింజ, నిమ్మ, ద్రాక్ష వంటి సిట్రస్ జాతి పండ్లు అగ్రస్థానంలో నిలుస్తాయి. ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, ఇన్ఫెక్షన్లపై పోరాడే శక్తిని అందిస్తాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసం సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు. వీటితో పాటు వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వెల్లుల్లిలోని 'అల్లిసిన్' అనే సమ్మేళనం అద్భుతమైన యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. పాలకూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే నట్స్, విత్తనాలు, తేనె వంటివి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ జలుబు, దగ్గు వంటి సమస్యలను నివారిస్తాయి. వర్షాకాలంలో సాధ్యమైనంత వరకు బయటి ఆహారానికి, పచ్చి కూరగాయలకు దూరంగా ఉండి, ఇంట్లో తాజాగా వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహార నియమాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండవచ్చని స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ సూచనలు కేవలం ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మాత్రమేనని, ఏదైనా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా? సైన్స్ ఏం చెబుతోందంటే..!



ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నుంచి రాత్రి భోజనం వరకు గుడ్లు చాలా మంది ఆహారంలో భాగమయ్యాయి. అయితే ఒక సందేహం మాత్రం ఎప్పుడూ ఉంటుంది.. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టాలా? లేక బయట ఉంచినా సరిపోతుందా? కొందరు ఎప్పుడూ ఫ్రిజ్‌లోనే నిల్వ చేస్తే.. మరికొందరు గది ఉష్ణోగ్రతలో ఉంచుతారు. మరి ఇందులో సరైన పద్ధతి ఏది? శాస్త్రవేత్తలు ఏమంటున్నారు? 2021లో 'ఫ్రాంటియర్స్ ఇన్ మైక్రోబయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. గుడ్లను 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో కొన్ని రోజులు ఉంచితే సాల్మొనెల్లా టైఫిమ్యూరియం అనే బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంది. అదే ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే ఆ బ్యాక్టీరియా పెరుగుదల గణనీయంగా తగ్గుతుంది. అంటే గుడ్ల భద్రత, తాజాగా ఉండటంలో ఉష్ణోగ్రత కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

**కొన్ని దేశాల్లో తప్పనిసరి?**

అమెరికా వంటి దేశాల్లో మార్కెట్‌లోకి వచ్చే ముందు గుడ్లను ప్రత్యేకంగా కడిగి శుభ్రం చేస్తారు. దీంతో వాటి పెంకుపై ఉండే సహజ రక్షణ పొర (క్యూటికల్) తొలగిపోతుంది. అది లేకపోవడంతో బ్యాక్టీరియా లోపలికి ప్రవేశించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే అక్కడ గుడ్లను 4 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలోనే నిల్వ చేయాలని అమెరికా వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

**యూరప్, ఆసియా దేశాల్లో పరిస్థితి భిన్నం**

యూరప్, ఆసియాలోని చాలా దేశాల్లో గుడ్లను కడగకుండా విక్రయిస్తారు. దీంతో వాటి సహజ రక్షణ పొర అలాగే ఉంటుంది. అందువల్ల సాధారణంగా ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం ఉండదు. అయితే చల్లని, పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. భారత్ వంటి వేడి, తేమ ఎక్కువగా ఉండే దేశాల్లో మాత్రం ఫ్రిజ్‌లో ఉంచితే గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

**బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించేది ఫ్రిజ్**

ఎక్కువ ఉష్ణోగ్రతలో సాల్మొనెల్లా ఎంటెరిటిడిస్ వంటి బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఈ పెరుగుదల మందగిస్తుంది. అయితే తరచూ ఫ్రిజ్‌లో పెట్టడం, బయటకు తీయడం మంచిది కాదు. ఇలా చేస్తే గుడ్లపై తేమ ఏర్పడి బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ఒకే ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం అత్యంత ముఖ్యం.


**ఇంట్లో గుడ్లను ఎలా నిల్వ చేయాలి?**

సూపర్‌మార్కెట్‌లో ఫ్రిజ్‌లో ఉంచిన గుడ్లను కొనుగోలు చేస్తే ఇంటికొచ్చిన తర్వాత కూడా ఫ్రిజ్‌లోనే పెట్టాలి. వాటిని ఫ్రిజ్ డోర్‌లో కాకుండా లోపలి షెల్ఫ్‌లో అసలు కార్టన్‌తోనే ఉంచడం మంచిది. ఎందుకంటే డోర్ తరచూ తెరవడం వల్ల అక్కడ ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది. స్థానికంగా లభించే కడగని గుడ్లను చల్లని వాతావరణంలో వారం రోజుల వరకు బయట ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు నిల్వ చేయాలంటే ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది.

**ఫ్రిజ్‌లో పెడితే రుచి మారుతుందా?**

గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచితే వాటి రుచి లేదా పోషక విలువలు మారిపోతాయనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ దీనికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉండటమే తప్ప వాటి రుచి లేదా పోషకాలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు.

# కిడ్నీలో రాళ్ల సమస్య?.. ఈ పండ్లు మీ డైట్‌లో చేర్చుకోండి!





**కిడ్నీలో రాళ్ల సమస్యను ఆహార నియమాలతో తగ్గించుకోవచ్చని నిపుణుల సూచన**
**నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయని వెల్లడి**
**పుచ్చకాయ వంటివి శరీరానికి నీటిని అందించి రాళ్లను కరిగిస్తాయంటున్న నిపుణులు**
**యాపిల్, బేరి, బొప్పాయి వంటి పండ్లు కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయని సూచన**
**ఈ పండ్లు కేవలం నివారణకేనని, వైద్యుడి సలహా తప్పనిసరి అని హెచ్చరిక**

ప్రపంచవ్యాప్తంగా కిడ్నీలో రాళ్ల (కిడ్నీ స్టోన్స్) సమస్య పెరుగుతున్న నేపథ్యంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదులో నీరు తాగడంతో పాటు కొన్ని పండ్ల వినియోగం రాళ్లు మళ్లీ మళ్లీ ఏర్పడే ప్రమాదాన్ని నివారిస్తుందని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**కిడ్నీలో రాళ్లు ఎందుకు ఏర్పడతాయి?**

సాధారణంగా కిడ్నీలో రాళ్లు కాల్షియం ఆక్సలేట్ లేదా యూరిక్ యాసిడ్ వంటి ఖనిజ లవణాలు పేరుకుపోవడం వల్ల ఏర్పడతాయి. ఇవి మూత్రపిండాల్లో లేదా మూత్ర నాళాల్లో ఏర్పడి తీవ్రమైన నొప్పిని, ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ సమస్యకు జన్యుపరమైన కారణాలు ఉన్నప్పటికీ, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, తగినంత నీరు తాగకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అయితే, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**సిట్రస్ పండ్ల ప్రయోజనాలు**

నిమ్మ, నారింజ, బత్తాయి వంటి సిట్రస్ జాతి పండ్లు కిడ్నీలో రాళ్ల నివారణకు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో 'సిట్రేట్' అనే రసాయనం అధికంగా ఉంటుంది. ఇది మూత్రంలోని కాల్షియంతో కలిసిపోయి, అది స్ఫటికాలుగా మారి రాళ్లుగా ఏర్పడకుండా అడ్డుకుంటుంది. అలాగే, మూత్రం జూస స్థాయులని పెంచి రాళ్లు ఏర్పడటానికి ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. ముఖ్యంగా రోజూ నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగడం చాలా సులభమైన, ప్రభావవంతమైన మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. నారింజ పండ్లలో కూడా సిట్రేట్‌తో పాటు విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అయితే, వీటిలో సహజ చక్కెరలు ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం మంచిది.

**శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచే పండ్లు**

పుచ్చకాయ, కర్బూజ వంటి పండ్లలో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల శరీరానికి కావాల్సిన ద్రవాలు అంది, మూత్రం ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా మూత్రపిండాల్లోని ఖనిజ లవణాలు పలుచబడి, సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ఇది రాళ్లు ఏర్పడే ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. ఈ పండ్లలో సోడియం శాతం కూడా తక్కువగా ఉండటం వల్ల కిడ్నీల మొత్తం పనితీరుకు మేలు జరుగుతుంది.

**ఇతర మేలు చేసే పండ్లు**

యాపిల్, బేరి వంటి పండ్లలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిలో 'ఆక్సలేట్' స్థాయులు చాలా తక్కువగా ఉంటాయి. కాల్షియం ఆక్సలేట్ రాళ్లతో బాధపడేవారికి ఈ పండ్లు సురక్షితమైనవి. బొప్పాయి కూడా అధిక నీటిశాతంతో పాటు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. ఇది కూడా కిడ్నీలకు స్నేహపూర్వకమైన ఆహారంగా పరిగణించబడుతుంది. అయితే, ఆహారంలో మార్పులు చేసుకునే ముందు ముఖ్యంగా కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వారి సలహా పాటించడం అత్యవసరం. ఈ పండ్లు కేవలం నివారణకు, ప్రమాదాన్ని తగ్గించడానికి మాత్రమేనని, ఇప్పటికే ఉన్న సమస్యకు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్న మాట.

# రాగి రోజూ తినడం మంచిదేనా? నిపుణులు చెబుతున్న నిజం ఇదే!




రాగి పోషకాలతో నిండిన ఆరోగ్యకరమైన చిరుధాన్యాల్లో ఒకటి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు దృఢంగా ఉండేందుకు, రక్తహీనత తగ్గించేందుకు, రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారూ రాగిని ఎక్కువగా ఆహారంలో చేర్చుకుంటున్నారు. అయితే రోజూ రాగినే ప్రధాన ఆహారంగా తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. గోధుమలు, బియ్యం, ఇతర చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరమని చెబుతున్నారు. రాగిలో కూడా కార్బోహైడ్రేట్లు ఉండటంతో పరిమిత మోతాదులోనే తీసుకోవాలని సూచిస్తున్నారు.

# ఆడవాళ్ల సినిమా.. రూమ్‌లో అందరూ పురుషులే!



'దంగల్' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్, సినీ పరిశ్రమలో వేళ్లూనుకుపోయిన పితృస్వామ్యం, లింగ వివక్షపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా వెబ్ సిరీస్ "హుంకార్-ది రోర్" ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమలో మహిళలు తమ గొంతు వినిపించడానికి ఎంతగా పోరాడాల్సి వస్తుందో వివరించారు.పితృస్వామ్య ధోరణులకు కేవలం పురుషులను నిందించడం సరికాదని, ఈ వ్యవస్థలో మహిళలు కూడా భాగమేనని ఫాతిమా స్పష్టం చేశారు. "ఈ పితృస్వామ్యం పురుషుల తప్పు మాత్రమే కాదు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. మనందరం ఒకే రకమైన సామాజిక వాతావరణంలో పుట్టి పెరుగుతాం. అందుకే అది మనలో అంతర్లీనంగా పాతుకుపోయింది. దీనిపై మనమంతా పోరాడాలి" అని ఆమె అన్నారు.పరిశ్రమలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ఫాతిమా పంచుకున్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన కథల చర్చలకు పిలిచినప్పుడు, ఆ గదిలో తాను తప్ప మరో మహిళ ఉండేది కాదని గుర్తుచేసుకున్నారు. "నిర్మాత వచ్చి ఇది మీకోసం అద్భుతమైన సినిమా అంటారు. మహిళ తన గొంతును వెతుక్కునే పాత్ర అని చెబుతారు. కానీ ఆ గదిలో నిర్మాత, దర్శకుడు, రచయిత అంతా మగాళ్లే ఉంటారు" అని ఆమె వివరించారు. అలాంటి సందర్భాల్లో తాను ఏదైనా సూచన ఇవ్వబోతే, వారు దాన్ని తీసుకోలేరని, వింత జోకులు వేస్తారని, మహిళల భావాలు ఎలా ఉంటాయో తమకే వివరిస్తారని (మాన్‌స్ప్లెయిన్) ఆవేదన వ్యక్తం చేశారు. హింసాత్మక ఘటనల విషయంలో కూడా మహిళల ఫీలింగ్స్ గురించి పురుషులే పాఠాలు చెబుతారని, అది పెద్ద విషయం కాదన్నట్టు మాట్లాడతారని ఆమె పేర్కొన్నారు.

## పూజా హెగ్డే ఇంట 'గ్రీన్ గణపతి'.. ప్రత్యేకత ఇదే!



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే పూజా హెగ్డే ఈ ఏడాది వినాయక చవితిని వినూత్నంగా, పర్యావరణ హితంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ముంబైలో కొనసాగుతున్న 'సీడ్ గణేశా' ఉద్యమంలో భాగంగా, ఆమె మట్టితో తయారు చేసిన ప్రత్యేక గణపతి విగ్రహాన్ని ఎంచుకున్నారు. భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ 'విత్తన గణపతి' విగ్రహాలను మట్టితో తయారు చేసి, వాటి లోపల మొక్కల విత్తనాలను పొందుపరుస్తారు. పండుగ పూర్తయ్యాక, ఈ విగ్రహాన్ని నీటిలో కాకుండా ఒక కుండీలోని మట్టిలో ఉంచి నీళ్లు పోస్తే, విగ్రహం కరిగిపోయి లోపలున్న విత్తనాలు మొక్కలుగా మొలకెత్తుతాయి.

## సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు




ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఆయన ఉల్లంఘిస్తున్నారంటూ ప్రముఖ మ్యూజిక్ సంస్థ 'సరిగమ' దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఈ సందర్భంగా ఆదేశించింది.సరిగమ సంస్థ తాజాగా దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఇళయరాజాపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. తాము కాపీరైట్లు హక్కులు కలిగి ఉన్న పాటలను ఆయన వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని, తద్వారా గతంలో కోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అతిక్రమిస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు ఇళయరాజాపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని విన్నవించింది. అంతేకాకుండా, ఆయన ఆస్తులను జప్తు చేసి, వాటి విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును తమకు చెల్లించాలని కూడా పిటిషన్‌లో కోరింది.గతంలో ఇళయరాజా స్వరపరిచిన పలు చిత్రాల పాటలకు సంబంధించిన కాపీరైటు హక్కులు తమకే దక్కుతాయని, అయినప్పటికీ ఆయన ఆ హక్కులను క్లెయిమ్ చేస్తూ వాణిజ్యపరంగా వాడుకుంటున్నారని సరిగమ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

## 'ఎపిక్' దాదాపు నా జీవిత కథే..



యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనంద్ దేవరకొండ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు తన జీవిత కథేనని, కేవలం ఒక్క విషయం మినహా మిగతావన్నీ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలేనని ఆయన వెల్లడించారు.

## ఆయన లోతుగా అర్థం చేసుకుంటారు!



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో 'పాకెట్ నావెల్' (గ్రాశీషనివ్ చీశీజవశ్రీ) చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. త్యాగరాజ్ కుమారరాజా దర్శకత్వంలో టైలర్ డర్డెన్ అండ్ కినో ఫిస్ట్ బ్యానర్‌పై రూపొందుతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్– కథానాయికగా నటిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక మోహనన్ ఈ చిత్ర విశేషాలను పంచుకుంది. ఈ సందర్భంగా ఈ ముద్దుగుమ్మ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజాతో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ తబ్బుబ్బయింది. "త్యాగరాజన్ కుమారరాజాతో కలిసి నేను 'పాకెట్ నావెల్' ప్రాజెక్టును పూర్తి చేశాను. స్క్రిప్ట్ రీడింగ్ సెషన్ల కోసం ఆయనను తొలిసారి కలిసినప్పుడు, మిగతా దర్శకులందరితో పోలిస్తే ఆయన ఎంత భిన్నమైనవారో అర్థం చేసుకోవడానికి నాకు కొద్ది నిమిషాలు మాత్రమే పట్టింది. ఆయన నటీనటులను ఒకేలాంటి పాత్రలో ఇరికించడానికి ప్రయత్నించరు, ప్రతీ విషయాన్ని చాలా శ్రద్ధగా గమనిస్తారు. ఆర్టిస్టులను కేవలం నటీనటులుగా కాకుండా ఒక వ్యక్తిగా లోతుగా అర్థం చేసుకుంటారు. పైపైన కనిపించే విషయాలకంటే.. మన ఆలోచనలు, స్వభావం ఎలా ఉంటాయో గుర్తిస్తారుఅలాంటి ప్రత్యేకమై న వ్యక్తులు ఇండస్ట్రీలో చాలా అరుదుగా కనిపిస్తారు. త్యాగరాజన్ ఆలోచనా విధా నం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఆయన దృక్పథం ఎంతో అందంగా ఉం టుంది. ఆయనొక అద్భుతమైన క్రియేటర్, తన పని పట్ల ఎంతో అంకితభావం కలిగి ఉం డి అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తారు" అంటూ మాళవిక చెప్పిన ముచ్చట్లు ప్రస్తుతం సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి.

## 'సర్దార్ 2' - మూవీ రివ్యూ!



కార్తీ కథానాయకుడిగా గతంలో వచ్చిన 'సర్దార్' హిట్ టాక్ తెచ్చుకుంది. అప్పటి నుంచి సీక్వెల్ కి సంబంధించిన వార్తలు ఊరిస్తూనే వచ్చాయి. 2022లో విడుదలైన ఆ సినిమాకి ఇంతకాలానికి సీక్వెల్ కుదిరింది. 'సర్దార్ 2' పేరుతో ఈ సినిమాను నిర్మించారు. ఆషికా రంగనాథ్ .. రజీషా విజయన్ .. మాళవిక మోహనన్ కథానాయికలుగా నటించిన ఈ సినిమా, ఈ రోజు (సెప్టెంబర్ 10)న థియేటర్లలో విడుదలైంది. స్పై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాకి, పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించాడు1981లో జపాన్ కి సంబందించిన ఒక కాప్సిల్ ఇండియాలో ఉండిపోతుంది. అది ఒక భయంకరమైన బయో వెపన్. అడవీ ప్రాంతంలో వదిలివేయబడిన ఆ కాప్సిల్ నుంచి విషవాయువు లీక్ అవుతూ ఉంటుంది. దాంతో అడవిని నమ్ముకుని జీవిస్తున్న వారంతా చిత్రమైన వ్యాధితో బాధపడుతూ చనిపోతూ ఉంటారు. ఆ కాప్సిల్ ను యాక్టివేట్ చేయాలన్నా .. డీ యాక్టివేట్ చేయాలన్నా మూడు తాళాలు అవసరమవుతాయి. ఆ మూడు తాళాలు గతంలో 'రా'లో పనిచేసిన వాల్ రస్ .. జారా .. ఏజెంట్ టైగర్ దగ్గర ఉంటాయి. ఆ కాప్సిల్ ను ఓపెన్ చేయాలంటే, ఈ మూడు కీస్ ను ఒకేసారి ఉపయోగించవలసి ఉంటుంది. రా' టీమ్ కి సహకరిస్తూ వస్తున్న సర్దార్, అడవిలోని గిరిజనులను చూసి చలించిపోతాడు. ఆ బయో వెపన్ కి నుంచి వెలువడుతున్న విషవాయువుల వలన వస్తున్న జబ్బులకు విరుగుడు కూడా జపాన్ దగ్గరే ఉందని తెలుసుకుంటాడు. ఆ మెడిసిన్ ను దక్కించుకోవాలని అనుకుంటాడు. ఇండియా మీదుగా తరలించబడుతున్న ఆ మెడిసిన్ కి సంబంధించిన బాక్సులను, ఇండియాలోనే ఆపేసి గిరిజనుల కోసం ఉపయోగించాలని నిర్ణయించుకుంటాడు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.